క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ అందజేత



గార్ల : మండలంలోని గోపాలపురం, గార్ల హైస్కూల్, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న గంగావత్ వెంకన్న సొంత ఖర్చులతో గురువారం స్టడీ మెటీరియల్ అందజేశారు. దనియాకుల రామారావు, హెచ్‌ఎంలు ఎం.రామచంద్రు, ఎం.సుందర్‌కుమార్, జోగయ్య, ఉపాధ్యాయులు గంగావత్ శ్రీనివాస్, రూప్‌సింగ్, మాన్‌సింగ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



కేసముద్రం : ఇనుగుర్తి మండలంలోని అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన కొంత మహేందర్ గురువారం ఇనుగుర్తి వైపునకు వెళ్తుండగా తన సెల్‌ఫోన్ మార్గమధ్యలో పడిపోయింది. దీంతో అతడు ఆ మార్గంలో వెతికినా కనిపించకపోవడంతో, ఇనుగుర్తిలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు రాజు, వెంకన్నకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో వారు అదే మార్గంలో వెతకగా, చెట్ల పొదల్లో సెల్‌ఫోన్ కనిపించింది. దీంతో కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో మహేందర్‌కు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఏఎస్సై సాంబయ్య అందజేశారు. ఈ మేరకు కానిస్టేబుళ్లకు మహేందర్ కృతజ్ఞతలు తెలిపాడు.

బోనస్ వెంటనే చెల్లించాలి



కురవి : సన్న రకాలకు ధరతోపాటు ప్రభుత్వం ఇచ్చే బోనస్‌ను కలిపి ఒకేసారి చెల్లించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. నాయకులు కరణం రాజన్న, బుర్ర సమ్మయ్య, తురక రమేష్, కన్నె వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, సైదులు, ప్రవీణ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



యాకయ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మున్సిపల్ పరిధిలోని గాంధీపురంలో గురువారం చోటు చేసుకుంది. టౌన్ సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం..గాంధీపురం గ్రామానికి చెందిన నాలుగో వార్డు కౌన్సిలర్ చల్లాల ఉమ భర్త యాకయ్య ఈ నెల 7వ తేదీన బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. జగ్జీవన్ కాలనీ దాటగానే ఎదురుగా మరో ద్విచక్ర వాహనం వచ్చి యాకయ్య బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతిచెందగా కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాకయ్య మృతిపట్ల మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో గేదె..



కేసముద్రం: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని కల్వాలలో గురువారం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ఆకుల సుధాకర్ తనకున్న గేదెలను మేపేందుకు ఊరి చివర పంటపొలాల వైపునకు తీసుకు వెళ్లాడు. కాగా అప్పటికే ఆ ప్రాంతంలో విద్యుత్ తీగ తెగి కిందపడి ఉంది. అటుగా వెళ్లిన గేదె ప్రమాదవశాత్తు తీగను తాకడంతో అక్కడికక్కడే విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడింది. గమనించిన రైతు పక్కనున్న గేదెలను దూరంగా తోలుకెళ్లాడు. సుమారు రూ.80వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

గుంతల పూడ్చివేత

తొర్రూరు : డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ నగర్ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం వలంటీర్లు పూడ్చారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ బరిగెల నారాయణ మాట్లాడుతూ..విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక సేవా దృక్పథం పెంపొందించడమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యమన్నారు. విద్యార్థులు శైలేష్, హరీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై సంత..తప్పని చింత

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- మరోచోటికి మార్చాలని వేడుకోలు



రోడ్డుపై నిర్వహిస్తున్న సంతతో భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం

కేసముద్రం : కేసముద్రంవిలేజ్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించే వారాంతపు సంతను (గురువారం) జ్యోతిరావుపూలే సెంటర్‌లో గల ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్నారు. దీంతో ప్రధాన రహదారికి ఇరువైపులా కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులను చిరువ్యాపారులు విక్రయిస్తున్నారు. కాగా చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కొనుగోలుదారులు ఇక్కడి సంతకు వస్తుంటారు. కాగా మరోవైపు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ నుంచి వ్యవసాయ ఉత్పత్తుల భారీ లోడుతో లారీలు ఇదే రహదారిపై వెళ్తుంటాయి. దీంతో మానుకోట నుంచి వరంగల్ వైపు, వరంగల్ నుంచి మానుకోట వైపునకు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు సైతం ఇదే మార్గంలో వెళ్లడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రయాణికులు, వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా సమీపంలో వేబ్రిడ్జిలు ఉండటంతో భారీ లోడ్ వాహనాలు రోడ్ల మీదుకు వస్తుండటంతో, రాకపోకలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రతీ వారం సంతలో ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఇప్పటికైనా సంతను మరో చోటికి మార్చాలని వాహనాదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

బయ్యారం ఉక్కు.. మానుకోట హక్కు



బయ్యారం: సర్వేలో పాల్గొన్న సీపీఎం నాయకులు



కురవి: రాజోలులో..

- సీపీఎం నేతలు కుంట ఉపేందర్, ఆకుల రాజు

బయ్యారం /కురవి : 'బయ్యారం ఉక్కు.. మానుకోట ప్రజల హక్కు' అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కుంట ఉపేందర్, ఆకుల రాజు అన్నారు. గురువారం ప్రజాసమస్యల అధ్యయనం సందర్భంగా కురవి మండలంలోని రాజోలు గ్రామంలో, బయ్యారం మండలంలోని కొత్తపేట–గంధంపల్లిలో నిర్వహించిన సర్వేను ఉద్దేశించి వారు మాట్లాడారు. సీపీఎం చేపట్టిన సర్వేను పార్టీ మండల కార్యదర్శి మలేడి కోటయ్యతో కలసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన తప్పుదోవ పట్టించే విధంగా ఉందని విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు రాష్ట్ర విభజన చట్టంలో ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమను ఏర్పాటు చేయకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాళం వెంకన్న, రాయల మనోహర్, ఎస్‌కె మల్బూర్, గొల్లపల్లి కృష్ణ, వెంకట్‌రాములు, బయ్యారంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మధు, వెంకన్న, ఆనందరావు, విజయ, దేవాదానం, భిక్షం, వెంకటయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి



షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న లక్ష్మణ్‌నాయక్

గార్ల : యువత వ్యసనాలకు బానిస కాకుండా సన్మార్గంలో పయనించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం గార్లలో నూతనంగా నిర్మించిన షటిల్ కోర్టును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి అలువాల సత్యవతి, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, ఎద్దు వెంకన్న, గాజుల గణేష్, క్రీడాకారులు జయశంకర్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఎంపిక చేయాలి

డోర్నకల్ : ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హుల ఎంపికకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సహకరించాలని డోర్నకల్ మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి, ఎంపీడీఓ శ్రీనివాసనాయక్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం కౌన్సిలర్లు, వార్డు అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సీఏలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇళ్లు లేని పేదల ఎంపిక కోసం అందరూ రాజకీయాలకతీతంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం

- సీపీఎం మండల కార్యదర్శి సైదులు



సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

నెల్లికుదురు : లబ్ధిదారుల భాగస్వామ్యంతో అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసిన ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని సీపీఎం మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని రామన్నగూడెం గ్రామ ఇళ్ల స్థల లబ్ధిదారులతో కలసి గురువారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ రాజుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 మంది లబ్ధిదారుల కోసం 3ఎకరాల స్థలాన్ని 1998లో అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసి ఇప్పటి వరకు పంపిణీ చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబు గౌడ్, నర్సయ్య, లబ్ధిదారులు రాములు, సోమయ్య, సైదమ్మ, జయమ్మ, ప్రభాకర్, పద్మ, వెంకటయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



మహబూబాబాద్ అర్బన్: విజేతలకు మెడల్స్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు



కేసముద్రంలో..



నెల్లికుదురులో..

కేసముద్రం : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని సబ్‌స్టేషన్ తండా జీపీలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల్లో, విజేతలుగా నిలిచిన జట్లకు గురువారం రాత్రి బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ క్రాంతి, ఎంఈఓ యాదగిరి, కేసముద్రం, ధన్నసరి సొసైటీ వైస్ చైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, మార్కెట్ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో క్రీడల్లో రాణించాలి

మహబూబాబాద్ అర్బన్ : సీఎం కప్ క్రీడాపోటీల్లో మానుకోట క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం మున్సిపాల్ స్థాయి సీఎం కప్ క్రీడలు ముగింపు కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి హాజరై మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్, కోచ్, పీడీలు పద్మావతి, పుష్పలీల, నాయక్, కుమార్, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

డోర్నకల్ : చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డోర్నకల్ జెడ్పీఎస్‌ఎస్ హెచ్‌ఎం బండి నర్సింహారావు కోరారు. సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీల్లో భాగంగా షటిల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో రవికుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

దంతాలపల్లి : క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీఎస్‌ఎస్‌లో ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్–2024 క్రీడల ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఎస్సై పిల్లల రాజు, ఆర్‌ఐ నజీముద్దీన్, ఎంపీఓ అఫ్సర్‌పాషా, హెచ్‌ఎంలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అరకొర వసతులతో సీఎం కప్ క్రీడా పోటీలు

నెల్లికుదురు : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో అరకొర వసతులతో నిర్వహించిన సీఎం కప్–2024 క్రీడాపోటీలు గురువారం ముగిశాయి. జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించిన నెల్లికుదురు క్రీడా మైదానంలో సీఎం కప్–2024 క్రీడా పోటీలు సరైన వసతులు లేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ముగ్గురికి షీల్డులు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు మూడ్రోజులుగా నిర్వహించిన సీఎం కప్ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలుర 7 టీంలు, బాలికల్లో 6 టీంలు మండల స్థాయికి ఎంపిక చేసినట్లు పీఈటీ ఐలయ్య తెలిపారు. తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ బాలరాజు, ఎంఈఓ రాందాస్, ఎంపీఓ పద్మ, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రకృతి సంరక్షణ అభినందనీయం



మహబూబాబాద్ రూరల్: ప్రకృతి సంరక్షణలో రాష్ట్రానికి దైద వెంకన్న సేవలు అవసరమని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో రియాజ్‌ను హరిత మిత్ర అవార్డు గ్రహీత, మొక్కల సంరక్షకుడు దైద వెంకన్న గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపి పూల మొక్కను బహూకరించారు.

పంచాయతీ ఎన్నికలకు సహకరించాలి

- ఎంపీడీఓ మంగమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న మంగమ్మ

గార్ల : గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ మంగమ్మ కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, దనియాకుల రామారావు, కందునూరి శ్రీనివాసరావు, కట్టెబోయిన శ్రీనివాసరావు, జడ సత్యనారాయణ, జి సక్రు, కత్తి సత్యం, జంపాల వెంకన్న, అజ్మీరా రాము తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



గూడూరు: యాదవనగర్‌కు చెందిన దివ్యాంగురాలు దయ్యాల భాగ్య ఇటీవల కాంబోడియాలో జరిగిన పారా త్రోబాల్ క్రీడలో బంగారు పతకం సాధించింది. కాగా గురువారం అరవింద పాఠశాలలో మండల సేవికా సమితి ఆధ్వర్యంలో అధ్యక్షురాలు పింగిళి స్వరూప, భాగ్యను ఘనంగా సన్మానించారు. క్రీడాకారిణి భాగ్యను మాజీ సర్పంచ్ నూనావత్ రమేశ్‌నాయక్, ఎంపీటీసీ కత్తి స్వామి, వేర్వేరుగా శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛంతో సన్మానించారు.

మార్కెట్ చైర్మన్‌కు..

కేసముద్రం : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డిని, మాజీ చైర్మన్ మర్రి నారాయణరావు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

నివాళి



గార్ల : సీపీఐ మండల సీనియర్ నాయకుడు పల్లా కోటి అకాల మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కట్టెబోయిన శ్రీనివాసరావు అన్నారు. గురువారం గార్లలో జరిగిన కోటి సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్న వయస్సులోనే కోటి అకాల మరణం పొందడం బాధాకరం అన్నారు.

పరామర్శ



నెల్లికుదురు : ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారం గ్రామానికి చెందిన శాల్వ లచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా గురువారం మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ స్థానిక నాయకులతో కలసి లచ్చమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబీకులను పరామర్శించారు.

ఆర్థికసాయం



కేసముద్రం : మండలంలోని అమీనాపురం గ్రామానికి చెందిన బొల్లెద్దు ధర్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి అమీనాపురం మాల సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.15వేల ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. సంఘం గౌరవ సలహాదారు ఆంధ్రయ్య, కోశాధికారి బొల్లెద్దు విజయ్‌చందర్, ఇస్సాకు, సామెల్, యాకయ్య, నగేష్, సతీష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైద్యశిబిరం



గూడూరు : మట్టెవాడలో గురువారం అయోధ్యపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 35 మందికి తెమడ పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ యమున మాట్లాడుతూ ఎవరైనా రెండు వారాలకు పైబడి దగ్గుతో బాధపడితే వెంటనే ఆస్పత్రికి వచ్చి తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ నరేష్, హెచ్‌ఈఓ లోక్యానాయక్, గణేష్, సర్దార్ బాబు, నరేందర్‌రెడ్డి, కృష్ణ, ఏఎన్‌ఎంలు కవిత, పుష్పలత ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు



కురవి : సీరోలు మండలం ఉప్పరిగూడెంలో బుధవారం రాత్రి ఏసుకృపా మందిర్ పాస్టర్ వంగజాన్ మార్క్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జేజీటీఎం పీటర్ విజయ్ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు బోధనలు శాంతిని, ప్రేమను చూపుతాయని తెలిపారు. పాస్టర్లు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

కురవి : యాసంగి వరిసాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీరోలు ఏఓ. దాయారాజ్ అన్నారు. గురువారం వివిధ గ్రామాల్లో వరి పంట సాగు చేసే రైతులకు అవగాహన కల్పించారు. డిసెంబర్ 15 వరకు దొడ్డు రకం విత్తనాలు వేసుకోవాలని, నారును 30 రోజులలోపు నాటుకోవాలని సూచించారు. నారుమడిపై బస్తాలు, టార్పాలిన్‌లు రాత్రి సమయంలో కప్పుకోవాలన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలి

తొర్రూరు రూరల్ : విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఈదునూరి ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని చెర్లపాలెం ఉన్నత పాఠశాలను బీఎస్పీ నాయకులు సందర్శించారు. ప్రసాద్ మాట్లాడుతూ చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న శివకుమార్ మధ్యాహ్న భోజనం చేసే సమయంలో ఆగంతుకుడు వాటర్ బాటిల్‌లో గడ్డి మందు కలిపిన వ్యవహారంపై విచారణ జరపాలన్నారు. బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, సంపత్ పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే..

దంతాలపలి: మండలకేంద్రానికి వివిధ గ్రామాల నుంచి పనులపై వచ్చే ప్రజలకు, ప్రయాణికులకు కాలకృత్యాలు(ఒకటికి, రెంటికి) తీర్చుకోవడానికి కష్టంగా ఉందని సీపీఎం నాయకులు అన్నారు. గురువారం వారు మండల కేంద్రంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి శ్రీనివాస్, గునుగంటి మోహన్, మధు, వీరబద్రం, చిత్రారెడ్డి, బూతం లక్ష్మి, కొమ్మినేని రామేశ్వరం, వెంకన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



మరిపెడ రూరల్ : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం మండల నాయకుడు పుల్లూరి దేవయ్య అన్నారు. మరిపెడ మండలంలోని తాళ్ల ఊకల్, రాంపురం గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లచ్చయ్య, పద్మ, ఉప్పలమ్మ, సోమయ్య, వెంకటయ్య, చంద్రయ్య, రమేష్, వెంకన్న, రాంపురం గ్రామ కార్యదర్శి పాల్వాయి రామన్న, బందు కృష్ణ, వరదయ్య, నరేష్, ఉమేష్, బందు గురువయ్య, వెంకన్న పాల్గొన్నారు.

డోర్నకల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శెట్టి వెంకన్న డిమాండ్ చేశారు. మండలంలోని పెరుమాళ్లసంకీసలో గురువారం నిర్వహించిన సర్వేలో వెంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బ వెంకటరెడ్డి, లక్ష్మి, కొండయ్య, కొర్ని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ట్రోల్ చేసిన వారికి తగిన బుద్ధి చెబుతాం'

- డోర్నకల్ ఎమ్మెల్యే భావ వక్రీకరణపై ఎస్పీకి కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వీరభద్రంగౌడ్, సుధాకర్

మహబూబాబాద్ రూరల్ : డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ మాటలను వక్రీకరించి ట్రోల్ చేసిన వారికి తగిన బుద్ధి చెబుతామని కాంగ్రెస్ పార్టీ కురవి మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ అన్నారు. ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ భాష వక్రీకరణపై ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌కు గురువారం కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ మాటతీరును కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించి యూట్యూబ్‌లో, ఇతర సోషల్ మీడియాల్లో ప్రచారం చేయడం జరిగిందన్నారు. కావాలని కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యేపై బురద చల్లాలని చూస్తున్నారన్నారు. దీనికి సంబంధించి సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు ఎస్పీని కోరారు.

ఎస్పీని కలిసిన ఏఎంసీ చైర్మన్

ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ బండి శ్రీనివాస్, కురవి ఆలయ చైర్మన్ కొర్ని రవీందర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్, మండల ఉపాధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్, కురవి టౌన్ ప్రెసిడెంట్ ఎస్.రాజేందర్ కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దడిగల శరత్, ఉపాధ్యక్షుడు దయ్యాల శ్రీధర్, బస్వ మణి, గండు మురళి, చెన్నూరి వెంకన్న పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య హరినాయక్



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

కురవి : మారుమూల తండాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య హరినాయక్ డిమాండ్ చేశారు. గురువారం బలపాలతోపాటు లక్ష్మీతండా, లింగ్యాతండా, గాజతండా గ్రామాల్లో సంఘం నాయకులు ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. లక్ష్మీతండాలో రైతులు మిర్చి పంటను సాగుచేయగా, దుకాణాల యజమానులు వారికి నాసిరకం విత్తనాలు అంటగట్టారని తెలిపారు. రైతులు పంట నష్టపోయారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు మాలోత్ కిషన్‌నాయక్, బానోత్ దేవా నాయక్, బాలు నాయక్, నవీన్ నాయక్, విజయ్ నాయక్ పాల్గొన్నారు.